*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక (29.08.69)*

# ప్రేమకు ఆవలి తీరాన

జ్యోతిర్మయీ!

మణిమయ దీపికాజ్వాలవలె కన్నులలో మెదిలే మీరు నా చేత ఈ సాహసం చేయిస్తున్నారు! ఇదే నా తప్పయితే ఆ తప్పును చేయించిన వ్యక్తి మీరే అవుతారు. కోపగించి నన్నల్లరి పెట్టకండి... ఇప్పటికే మీ చిరునవ్వుల పువ్వులు నాపై విరజిమ్మి అల్లరి పెట్టారు.

షోడశ స్త్రీ సహస్ర చక్షుః ప్రసార హార సార మసార మోహన శరీర అన్న వర్ణనకు తగినది మీరే! మిమ్మల్ని చూసిన క్షణంలో దివినుండి భువికి దిగిన చంద్రరేఖ కాదుగదా- అనుకున్నాను. మీ చిరునవ్వుల వాన నాజీవితంలో ఎదురుచూసిన తొలకరి. ఒక్కమాటలో నన్ను నేను మర్చిపోయాను.

స్త్రీ హృదయం తెలిసికోకుండా ప్రేమలేఖ వ్రాయటం గర్హించే నేను జీవితంలో మొదటి సారిగా ఎవ్వరికి తెలియకుండా ఇలా వ్రాస్తున్నాను. నన్ను నేను మరచి నా మనస్సు మీ ముందుంచుతున్నాను.

ఆడపిల్ల తల్లిదండ్రుల చాటుపిల్ల - అని అంతా అంటారు కాని.... మనసులోని మాట చెప్పుకోటానికి అసలు ఆడపిల్లలకున్న అవకాశాలు మగవాళ్ళకు లేనేలేవు. అవసరం కల్పించు కొని ఆడపిల్లలు మగవాళ్ళతో పరిచయం చేసుకుంటే పట్టించుకొనేవాళ్ళే మగవాడు. కన్నెత్తి చూస్తే పలురకాలుగా అంటారు. ఇక ఇలా సాహసం చేసిన నాబోటివాడి అదృష్టం ఎలా ఉంటుందో మీ వంటి ఆడపిల్ల మంచి మనస్సుపై ఆధారపడి ఉంటుంది.

మీ ప్రేమనుపొందే అర్హత నాలో ఉందో లేదో నాకు తెలియదు. స్వాతివానకోసం ముత్యపు చిప్పలు ఎప్పుడూ ఎదురుచూస్తూనే ఉంటాయి!

దీపానికి జ్వాల సర్వస్వమవుతుంది. నా జీవితానికి ఈ జ్యోతిర్మయి సర్వస్వం కావాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రేమ లేకున్నా, ప్రేమించలేకపోయినా ద్వేషమైనా ఉండనివ్వమని నా కోరిక. మీ ద్వేషంలోనయినా ప్రేమకు రెండవవైపు చూడగల్గుతాను.

మీ జాబుకై ఎదురు చూచు -

రాజశేఖర్

2

శ్రీ రాజశేఖర్,

నమస్తే! మీ ప్రే.... లేఖ అందుకున్నాను. పూరేకుల్లా విచ్చుకున్న కాగితం మడతల్లోంచి మీ మనస్సులో విరిసిన మరుమల్లెల గుబాళింపులు నన్నొక్కసారిగా చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేశాయి.

మీ చేత సాహసం చేయించింది నేనే అన్నారు.... నాకు నవ్వు వచ్చింది. బహుశః ఆడ పిల్లలు సాహసం చేయించగలరు కాని చేయలేరేమో!

నాది మంచి మనసని అంటున్నారు కదూ! ఉహూం ఎంతాశ! నేను కఠినురాలనని నాతోటి పరిచయమున్న వాళ్ళందరూ అంటూంటారు. మీరు బొత్తిగా అమాయకరాజులా ఉన్నారు. నన్ను నమ్మకండి.

దీపానికి జ్వాల సర్వస్వం కావచ్చు. కాని ఆ జ్వాలకు దీపమే ఆధారం అన్నది జగత్సత్యం.

ప్రేమకు రెండోవైపు నాకు తెలియదు. నేను చిన్నదాన్ని. నన్ను మన్నించి పిలువవద్దు. ఆడపిల్లను. ఇంతకన్న మీకేం వ్రాయగలను?

మీ జాబు ఈవేళ అందుకోగలనా!

జ్యోతిర్మయి.

3

ప్రియమైన జ్యోతిర్మయీ!

నేనింత అదృష్టవంతుడినని ఎప్పుడూ అనుకోలేదు. నేను లేఖ వ్రాయటంలోని తృప్తికంటే నీ లేఖ అందుకోవటంలోని ఆనందం అవధిలేనిది జ్యోతీ! నీ లేఖ వెయ్యిసార్లు చదువుకున్నా తనివితీరలేదు.

నిన్న రాత్రంతా నిద్రలేక తపస్సు చేశాను. నా ప్రణయదేవతకి అనుగ్రహమే కలుగుతుందో ఆగ్రహమే కలుగుతుందో ఊహించలేక ఆవేదనతో వేగిపోయాను. బయట అడుగుల చప్పుడు విన్నప్పుడల్లా.... మీ అన్నయ్య తలుపు దగ్గరికి వచ్చినట్లు, నన్ను మరుక్షణంలో ఇంటినుంచి పంపివేయటానికి సిద్ధమౌతున్నట్లు ఉలిక్కిపడేవాడిని. తిరిగి అందుకున్న పత్రికలో నీ ప్రేమలేఖ చూసేవరకు మీ తమ్ముడు పొరపాటున మీ వదినకికాని ఇచ్చి ఉండడు కదా అన్న శంకలతో వేగిపోయాను.

నీ పేరు చదువుతూ కిటికీలోంచి బయటకు చూస్తూ ఏదో పని ఉన్నట్లు నీవు అరుగు మీదకు వచ్చి రత్నాలు విరజిమ్మి వెళ్ళిపోవటం కనిపించింది. ఆ రత్నాల నేరుకోవాలా.... ఈ ముత్యాలను చదువుకోవాలా అన్న సందిగ్ధంలో పడ్డానంటే నమ్ము!

"ఎంతాశ?" అన్నావు. మరి నాకు కాక ఎవరికుంటుందా ఆశ? నవనీత హృదయం కల ప్రేయసికంటే కఠిన హృదయం గల ప్రియురాలు కోరుకోదగినది – అని నా స్నేహితుడంటూ ఉంటాడు. అది నిజమేనేమో!

జ్యోతీ! ఇది కలకాదు కదా! ఒకవేళ ఈ కల చెదిరిపోతుందేమో! మరొక్కసారి మీ ముద్దుమోము కన్నులవిందు చేసుకోనీ నా రాణీ!

ప్రణయరాగ రంజితమైన నీ బుగ్గలకెంపులను నీ వలపు తూపుతో వాడిన నా పెదవులపై అలంకరించుకోవాలని కోరుతూ –

– నీ రాజా.

4

ప్రియ రాజా!

ప్రణయ పరిమళాల మించిన మీ ప్రేమలేఖ నన్ను నందనవన విహారానికి తీసుకువెళ్ళింది. మీ హృదయరాణి కాగలిగిన గర్వంతో ఊగితూగి పోయాను.

మీరు నిన్న సూటు వేసుకొని బయటకు వెడుతుంటే చూశాను.... మీ వ్యక్తిత్వంలోని ఠీవికి ముగ్ధురాలినైనాను. మీ శరీరం మీద ఆ కోటుకి కూడా అందం వచ్చింది.

మీ అంత అందంగా, మధురంగా నేను వ్రాయలేను. భావాలెన్నో పొంగిపొరలి వస్తున్నాయి. వాటికి తగిన పదజాలం నాకు తెలియదు. నా కళ్ళల్లో మీరే చదువుకోండి!

బుగ్గలలో కెంపులు రంగరించే శక్తి ఉన్న వాళ్ళకు పెదవులతో వాటినందుకునే హక్కు ఎప్పుడూ ఉంటుంది!

మీ ప్రేమలేఖ కోసం వేయికళ్ళతో ఎదురు చూచు –

–మీ రాణి, జ్యోతిర్మయి.

5

నా హృదయరాణీ, జ్యోతిర్మయీ,

నీ అనురాగ స్రవంతిలో ఓలలాడి తేలిపోతున్న నేను... గుండెలు పగిలే ఆనందానికి తట్టుకోగలనా అని భయపడుతున్నాను....

రాణీ! పమిటచెంగు నడుమువద్ద బిగిస్తూ ప్రొద్దున్న బయటకు వచ్చావు కదా! నీకెంత నడుమున్నదో నాకు తెలియదనా? నీ శిరోజాల సౌందర్య ఖనులు.... నన్నురిపోసి నీలోకి చేర్చుకుంటాయేమో జ్యోతీ!

మురిపించిన ముద్దుగుమ్మా! అంతలోనే తుర్రున పారిపోవాలా! నా ఎదుట నిలబడటానికి కాళ్ళునొచ్చాయా.... గతరాత్రి ఎందరి మధుర స్వప్నసీమలోనికి పరుగెత్తి వెళ్ళావో? నా మనస్సు అసూయ జ్వాలలతో వేగిపోతుంది. – నన్నిలా కవ్వించి నొవ్వ చేయటం ధర్మమా రాణీ!

గుండె దొంగిలించుకుపోయి నీకేం హాయిగా వున్నావు. విరహాగ్నితో వాడి వత్తనై పోతున్నాను నేనిక్కడ. "ఆమె ముద్దివ్వటానికి వెనకాడుతుందా? అడగలేక నేనే వెనుతీస్తునేమో!" అని ప్రణయాలాపం చేస్తున్నాను నేను.

నీ వెలుగుచేతనే సూర్యునికా ప్రకాశం వచ్చిందేమో! నీ కన్నులే వెన్నెలకా చల్లదనాన్ని ప్రసాదించాయేమో....! మరి నా మీద నీకింత చిన్నచూపెందుకు? నిజంగా నీవు కఠినురాలవే సుమా!

"అందగత్తెలతో పరిచయం ఏర్పరచుకోవాలంటే చిత్రలేఖనం వంటి విద్య ఒకటి ఉండాలిరా!' అని నా స్నేహితుడంటుండేవాడు. కాని భౌతికంగా ఏ కళాకారుడినీ కాకపోయినా నీ అందాలను చిందే చిత్రాలనెన్నో నా మనో ఫలకంపై చిత్రించుకున్నాను దేవీ! ఆ ఆనందం

నా కొక్కడికే పరిమితం కావాలని ఆ కుంచెను నాలోనే దాచుకున్నాను.

నీపై నేనలిగాను రాణీ! మళ్ళీ నీవు కనిపించే వరకు నాలో అలక తగ్గదు.... నేను వెఱ్ఱివాడినంటావా మళ్ళీ! పోనీ, నా వెఱ్ఱి నాకానందం!

ఇదివరకు పూలతోటల్ని చూసి మురిసిపోయాను. కాని, నిన్న నీవు దొడ్లో పూలమొక్కల మధ్య నడయాడుతున్నప్పటి ఆనందం నాకెప్పుడూ కలుగలేదు.

ఇంకా ఎంతో వ్రాయాలని వుంది. నీ కన్నులలోని భావాలను చదవాలని ఉంది. మళ్ళీ నీవు కనిపిస్తే కాని.... నా కలంలో సిరా ప్రవహించదు. నా కన్నుల దృష్టి నిలబడదు.

నీ దర్శనం చేత నిద్రాహారాలు మానివేసి పదివేల యుగాలు (ఒక సెకను – నా దృష్టిలో ఒక యుగం) ఇప్పటికే గడిపాను. ఇంక కనికరించి దగ్గరగా రా! ఒక్క ముక్క మాట్లాడు. నీ మధుర కంఠం వినిపించాక నీ కోసం యుగ యుగాల వరకు వేచి యుండమన్నా నేను సిద్ధంగా ఉంటాను.... కాని ఇంక.... భరించలేను. త్వరగా అంతఃపురాన్ని వదలి బయటకు రా దేవీ! నీ రాకకోసం కనురెప్పవేయక ఎదురుచూచే –

– నీ ప్రియ రాజా.

6

నా రాజా!

మీ లేఖలోని భావావేశంతో పరవశించి హృదయంలో పొంగిపొరలే ఆనందానికి తట్టుకోలేకపోయాను. ఆ వెంటనే మీ దగ్గరికి పరుగెత్తుకు వచ్చి వాలదామనిపించింది.

కాని, ఇంటికెవరో బంధువులు వచ్చారు. వాళ్ళంతా ఉండగా ఎలా రాను? మీరు మా ఇంట్లో చేరి సరిగ్గా నెలకాలేదాయె. అప్పుడే ఇంత చనువేర్పడిందని ఎవరైనా గ్రహిస్తే.... ఇంకేమైనా ఉందా?

బంధువులంతా వెళ్ళేసరికి చీకటి పడింది. మీ దగ్గరికి వద్దామనుకున్నాను. కాని, మీ గదికెవరో స్నేహితులు వచ్చారు. వాళ్ళు వెళ్ళి పోయాక వద్దామనుకున్నాను.... కాని, వాళ్ళతో పాటు మీరూ బయటకు వెళ్ళిపోయారు.

మీ కోరిక ప్రకారం మీ ఎదుట పడదామన్నా వీలులేకపోయింది. నన్ను క్షమించరూ... ఈ మాటు మీరు కోరుకున్న వెంటనే మీ ఎదుటికి వస్తాను. సరేనా! మీ జాబుకూ ఎదురు చూచు –

– మీ జ్యోతిర్మయి.

7

జ్యోతిర్మయీ!

నిన్న నా గదికి వచ్చిన చంద్రమోహన్‌ని గుర్తుపట్టి ఉంటావు నీవు. ఇది వరకెప్పుడో అతను నేనున్న గదిలోనే అద్దెకుండేవాడుట కదూ!

మనమధ్య సాగిన ఉత్తరాలు నిన్నే నా జీవితేశ్వరిని చేసుకునేలా ప్రోత్సహించాయి.

స్నేహితులద్వారా మీ అన్నయ్యకి, నాన్నగారికి చెప్పిద్దామని నిన్న మా వాళ్ళని గదికి పిలిపించాను. అనుకోకుండా మా స్నేహితుని బంధువులబ్బాయి చంద్రమోహన్ కూడా కలిశాడు. నా కోరిక విన్న మీదట అతడికీ ఇంటితో ఎటువంటి అనుబంధం ఉందో చెప్పాడు. వివరాలు విని నిర్ఘాంతపోయాను.

అతడు చెప్పినదేమిటో నీకు తెలియజేసి బాధపెట్టడం నాకిష్టం లేదు. ఏ మర్మం లేకుండా నా మనస్సుని నీకు తెలియజెప్పానే కాని.... నిన్నేమీ మోసం చేయలేదు కదా? నన్నెందుకిలా మభ్య పెట్టావు జ్యోతిర్మయీ! నీతో ఒక్కమాటయినా మాట్లాడకుండానే మనస్సునంతా ఆక్రమించావే.. నోటితో చెప్పకపోయినా జరిగినదేదో ఉత్తరంద్వారా తెలియబరచకపోయావా?

ఎందుకిలా చేశావు?.... చంద్రమోహన్‌ని పెళ్ళిచేసుకుంటానని ఎందుకు మాటిచ్చి తిరస్కరించావు? ఇప్పుడు.... నన్ను.... నన్నిలా ఎందుకు పిచ్చివాడిని చేసి ఆడిస్తున్నావు?

నిన్ను హృదయంలో హృదయంగా ప్రేమించిన నా నోటివెంట ఇంకెంత కఠినమైన మాటలు వస్తాయోనని నాకు భయంగా వుంది.

నన్నిక వేధించక నీ మనస్సులోని మర్మాన్ని విడిచి నా మనస్సు నావరించుకున్న మాయను తొలగించు! నన్నిక బాధ పెట్టకు జ్యోతిర్మయీ!

– రాజశేఖర్

8

శ్రీ రాజశేఖర్!

మీతో ఒక నిజం చెప్పకపోవటం వాస్తవమే కాని.... మిమ్మల్ని మోసగించాలని, బాధించాలని నేనేదీ చేయలేదు.

మీరు ప్రేమలేఖ వ్రాశారు. అది అందుకునే అర్హత నాకు లేకపోయినా క్షణికమైన అదృష్టం నన్ను వరించింది. ఒక బలహీనతతో క్షణికమైన ఆనందానికి అర్రులు చాచి నా హృదయాన్ని కదలించుకున్నాను. దానివల్లనే మన మధ్య లేఖలు పరుగులు తీశాయి. నా హృదయంలో జీవితకాల నిరీక్షణకు ఒక అర్థం చెప్పాయి.

అంతేకాని, నేను ఏ చంద్రమోహన్‌కి పెళ్ళిచేసుకుంటానని మాటివ్వలేదు.... తిరస్కరించలేదు. అతను మా యింటికి వచ్చిన క్రొత్తలో ఒక ప్రేమలేఖ వ్రాసిన మాట నిజం. అటువంటి పని ఇంకెప్పుడూ చేయవద్దని, పెద్దవాళ్ళకు తెలిస్తే రగడవుతుందని, నా కిటువంటివి ఇష్టముండవని.... అతను వ్రాసిన లేఖతో సహా త్రిప్పి పంపుతూ జవాబు వ్రాశాను. అంతే! అతను వారం తిరక్కుండా గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. నా ఒక్కదానికి తప్ప అతను ఎందుకు వెళ్ళిపోయాడో మా ఇంట్లో ఎవ్వరికీ తెలియదు.

తనకు దక్కని అదృష్టం మీకు తేలిగ్గా లభిస్తున్నందుకు అతడు అసూయతో చేసిన పని అది. సరే, అన్నిటికీ మీకే మంచిదయింది. మీలో అనుమానాలు రగిలించిన చంద్రమోహన్ తనకి తెలియకుండానే మీకెంతో మహోపకారం చేశాడు.

“..... ఒక్క ముక్క మాట్లాడు. నీ మధురకంఠం వినిపించాక నీకోసం యుగయుగాల వరకు వేచి యుండమన్నా నేను సిద్ధంగా ఉంటాను. కాని, ఇంక.... భరించలేను” – మీ లేఖలోని ఆ వాక్యాలు చదివినప్పుడు నా కన్నీళ్ళెలా వరదలై పారాయో దేవుడికొక్కడికే తెలుసు. మీతో మొదట్లోనే నిజం చెప్పనందుకు నా మనస్సెంత కలగిపోయిందో మీరూహించలేరు.

రాజశేఖర్! మీ ఎదుటపడదామని వస్తే మీరు బయటకు వెళ్ళిపోయారని మీకు వ్రాశాను... ఇప్పుడు నిజం ఒప్పుకుంటున్నాను, మీరంతా బయటకు వెళ్ళిపోయేవరకు లోలోపల దాక్కున్నాను. మీ ఎదుట పడే ధైర్యం నాకు లేదు.

ఎందుకని? – అని అడగరేం?

చెప్తాను. వినండి... కాదు కాదు. చెప్పలేను. వ్రాస్తాను. చదవండి.

అర్థమయింది కదూ!

నాకెప్పటికీ పెళ్ళి కాదని నాకు తెలుసు. కాని, ఒక యువ హృదయంలో తాత్కాలికంగానైనా ఆరాధింపబడే సదవకాశం వచ్చింది. చంద్రమోహన్ విషయంలో ఆ అవకాశాన్ని చేజారవిడుచుకున్నాను. కాని, మీ విషయంలో అలా చేయలేకపోయాను.

అడవిని కాచిన వెన్నెలవంటి ఈ సౌందర్యం ఎందుకు అని బాధపడేదాన్ని. కాని, ఆ వెన్నెల లేకపోతే ఆ అడవిని ఎవ్వరూ చూసేవారు కాదు. తనకు తెలియకుండా అడవిలో అడుగు పెట్టిన రాజకుమారుని చూసి వెన్నెలకు వెఱ్ఱి ఆనందం కలిగింది.

తర్వాత మిమ్మల్ని బాధించవలసి వస్తుందని తెలిసికూడా నేను నా బలహీనతకు లొంగిపోయాను. అయినా నేను మొదటి లేఖలో వ్రాసినట్లు ప్రేమకు రెండోవైపు నాకు తెలియదు. ప్రేమించటమే నాకు తెలుసు.

మనసుమాత్రం ఇచ్చిన దేవుడు అనుభవంతో దాన్ని రాయిగా చేసుకునే శక్తిని కూడా నాకు ప్రసాదించాడు.

కాని, మీ లేఖల్లో ప్రతి అక్షరంలోను ప్రతిబింబించే మీ లలిత హృదయం నాలో స్పందించినప్పుడల్లా నా మనస్సు విలవిలలాడిపోతోంది.... ఒక్కసారి మిమ్మల్ని సమీపించి రెండు ఓదార్పు మాటల్ని చెప్పటానికయినా శాశ్వతంగా మూసివేసిన నా నోటిని దేవుడు ఒక్క నిమిషం తెరవాలని కోరుకుంటున్నాను.

కాని నా దురదృష్టంకొద్దీ అది అసాధ్యం!

మీ హృదయంలో కొంతకాలం చోటు చేసుకున్నందుకు నన్ను క్షమించండి.

ఈ జన్మకు నాకీ అదృష్టం చాలు.

సెలవు.

–జ్యోతిర్మయి.